ప్రజాశక్తి
గురువారం 20 జులై 2023 5
శ్రీ సత్యసాయి



20,21వ తేదీల్లో ఎస్‌సిపిసిఆర్ సభ్యుల పర్యటన

పుట్టపర్తి అర్బన్ : ఈ నెల 20,21వ తేదీల్లో శ్రీ సత్యసాయి జిల్లాలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎపిఎస్‌సిపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణ, బత్తుల పద్మావతిలు జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ పి.అరుణ్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఈ సభ్యులు బాలల హక్కుల పరిరక్షణకు అధికార యంత్రాంగం చేపట్టిన, చేపట్టబోతున్న అంశాలపై వివిధ శాఖల అధికారులతో వారు చర్చించనున్నారు. 20వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లాలోని ఐసిడిఎస్ సిడిపిఒలతో బాల్య వివాహాల నిర్మూలనపై పుట్టపర్తి ఎంపిడిఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు బుక్కపట్నం డైట్ కళాశాలలో ఉచిత విద్య నిర్భంధ హక్కు చట్టంపై సమీక్ష నిర్వహిస్తారు. 21వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు హిందూపురంలో అంగన్వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించనున్నారు. 11.45 గంటలకు లేపాక్షి కెజిబివి.స్కూలును సందర్శిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పుట్టపర్తి బాలసదన్‌కు చేరుకుని అక్కడి పిల్లలు, సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పక్కాగా ఇంటింటి సర్వే

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పెషల్ సమ్మర్ రివిజన్ ఫైనల్ పబ్లికేషన్ నేపథ్యంలో ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం నాడు పుట్టపర్తి కలెక్టర్‌లోని విసి హాల్ నుంచి స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2023 ఫైనల్ పబ్లికేషన్‌పై పెనుకొండ సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, బిఎల్ఒలు, ఈఆర్ఒలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2023 ఫైనల్ పబ్లికేషన్‌లో భాగంగా ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు నెల 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెలరోజుల పాటు నిర్వహించే సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలో బిఎల్ఒలకు శిక్షణ పెండింగ్ ఉంటే పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లే ముందు సర్వే ఎలా చేపట్టాలన్న దానిపై శిక్షణ అవసరమన్నారు. బిఎల్ఓ విజిట్ షెడ్యూల్ అన్ని రాజకీయ పార్టీలకు ఇవ్వాలన్నారు. ఈనెల 21వ తేదీన రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్‌లతో సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని మొదలుపెట్టాలన్నారు. ఈ సర్వేలో వాలంటీర్లు ఎట్టి పరిస్థితుల్లో పాల్గొనేందుకు వీలులేదన్నారు. సర్వే జాగ్రత్తగా చేస్తే ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు రావని తెలిపారు. మార్పులు, చేర్పులు 100 శాతం పరిశీలన చేయాలన్నారు. 4 శాతం కంటే ఎక్కువగా ఆడిషన్స్ ఉంటే ఏఈఆర్ఓలు పరిశీలన చేసి రిపోర్ట్ అందించాలని, 2 శాతం కంటే ఎక్కువగా తొలగింపులు (డిలీషన్స్) ఉంటే ఈఆర్వోలు పరిశీలన చేయాలని సూచించారు. వ్యక్తిగతంగా ప్రతి మార్పులు, చేర్పులను పరిశీలన చేసి రిపోర్ట్ అందించాలన్నారు. వచ్చిన ఫిర్యాదులు ఎంతవరకు నిజమో క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, కదిరి ఆర్డీవో రాఘువేంద్ర, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ పాల్గొన్నారు.



జెసి మౌనం వెనుక..?

◆ దివాకర్‌రెడ్డి రాజకీయాలకు దూరం జరిగారా.? ◆ ఆయన తనయుడు పవన్ పయనమెటు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా రాజకీయాల్లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండేది జెసి కుటుంబం. ఇప్పటికీ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి వార్తల్లో ప్రముఖంగా ఉంటూన ఉంటారు. కాని ఆయన అన్నయ్య జెసి.దివాకర్‌రెడ్డి మాత్రం గత కొంతకాలంగా మౌనంగా ఉంటూ రావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. స్వపక్ష నేతలైనా, విపక్ష నేతల గురించి అయినా నిర్మోహమాటంగా మాట్లాడి ఆయన ఎప్పుడూ వార్తల్లో వ్యక్తిగా ఉంటూ వచ్చేవారు. అయితే గత కొంత కాలంగా ఆయన రాజకీయపరమైన వ్యాఖ్యలేవి చేయకుండా మౌనంగా ఉంటూ రావడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. రాజకీయాల్లో ఆయన ఓటమి ఎరుగుని నాయకుడిగా ఉంటూ వచ్చారు. 1983లో తొలిసారిగా రాజకీయ రంగ ప్రవేశం చేసి స్వతంత్రగా ఆ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత 1985లో కాంగ్రెసు పార్టీ తరుపున తొలిసారిగా పోటీ చేశారు. అప్పటి నుంచి 2009 వరకు కాంగ్రెసుపార్టీ తరుపేనే పోటీ చేసి డబుల్ హ్యాట్రిక్ విజయాలను సాధించారు. ఆ తరువాత 2014లో రాష్ట్రరాజకీయ పరిణామాల నేపథ్యంలో టిడిపిలో చేరి పార్లమెంటుకు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లోనూ ఆయనే విజయం సాధించారు. ఇక 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. ఆయన తనయుడు జెసి. పవన్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా పోటీ చేశారు. ఆయన ఓటమి చెందారు. ఈ రకంగా ఆయన పోటీ చేసి ఓటమి చెందింది మొట్టమొదటి సారి ఎన్నికలోనే, ఆ తరువాత అన్ని ఎన్నికల్లో విజయం సాధించి ఓటమి ఎరుగని నాయకుడిగా ముద్ర వేసుకున్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి తరువాత కూడా రాజకీయంగా హడివుడే చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపైనా అనేక విమర్శలు చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వం వైపున ఉంచి ఆయనకు సంబంధించి గనులను మూసివేయడం తదితర సమస్యలు చుట్టుముట్టినా తన విమర్శల పదునును తగ్గించలేదు. అయితే గత కొంత కాలంగా వీటికి దూరంగా ఉంటూ, ఎటువంటి రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా ఉంటూ వస్తున్నారు. త్వరలో ఎన్నికలు సమీస్తున్న తరుణంలోనూ ఆయన రాజకీయపరంగా యాక్టివ్‌గా లేకపోవడం చర్చనీయాంశమూ అవుతోంది. ఇదే నేపథ్యంలో ఆయన తనయుడు జెసి, పవన్‌కుమార్‌రెడ్డి కూడా రాజకీయపరమైన కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలో కేశ్ పాదయాత్రలోగాని, పార్టీ కార్యక్రమాల్లోనూ ఎక్కడా కనిపించటం లేదు. వ్యక్తిగత కార్యక్రమాల రిత్యా కొంతకాలం ఇతర దేశాలకు వెళ్లినప్పటికీ, ఆ తరువాత కూడా ఆయన పాల్గొన్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ కుటుంబం నుంచి బాబాయ్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డిలే తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గం కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటున్నారు. జెసి.దివాకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిలు మాత్రం ఎన్నికల సమయం



ఆసన్నమైనా కనిపించకపోవడం చర్చనీయాంశమూ అవుతోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన అసెంబ్లీ బరిలో దిగుతారా లేక పార్లమెంటుకే మరోమారు ప్రయత్నిస్తారా అన్న చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా ఎప్పుడూ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా ఉండే ముఖ్య నేత ఇలా సైలెంట్ అవడం వెనుక ఆంతర్యం ఏమిటా అని రాజకీయ వర్గాల్లో గుసగసలు వినిపిస్తున్నాయి.

నాణ్యతగా నాడు-నేడు పనులు

◆ అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు ◆ జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ దశ మనబడి నాడు -నేడు పనులు పారదర్శకంగా నాణ్యతతో చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 2వ విడత నాడు-నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ పనుల్లో వెనకబడిన మండలాల, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఫీల్డ్ ఇంజినీర్లు, ఎంఇఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ నాడు-నేడు పనులకు సంబంధించి జిల్లాలో మడకశిర, రొళ్ల, గోరంట్ల, పెనుగొండ, హిందూపురం అర్బన్, చిలమత్తూరు, బుక్కపట్నం, అమరాపురం, ధర్మవరం అర్బన్ ప్రాంతాలు పురోగతి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఉండాలని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దన్నారు. ఈ పనులకు సంబంధించి ఇసుక, సిమెంట్ కొరత లేకుండా చూడాలని ఇంజినీర్లను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు ఈ పనుల నాణ్యతను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో పనులు చేపట్టిన పనులను క్షేత్ర స్థాయి ఇంజినీరింగ్ సిబ్బంది ప్రతివారం తప్పనిసరిగా పనుల పురోగతిని తెలియజేసేలా ఫొటోలు తీసి మనబడి నాడు-నేడు యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇకపై ప్రతి బుధవారం నాడు-నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, ఇంజినీర్లు అన్వర్‌బాషా, వెంకటరమణ, గంగాధర్ జయచంద్ర రెడ్డితో పాటు పది మండలాల ఎంఈఒలు, ఫీల్డ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులను నియంత్రించాలి

ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్

ప్రజాశక్తి-సోమందేపల్లి

మహిళలపై జరుగుతున్న హింస పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తోందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దిల్షాద్ విమర్శించారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఐద్వా మండల కమిటీ సమావేశం బుధవారం సంఘం మండల అధ్యక్షులు లీలావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు దిల్షాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్షాద్ మాట్లాడుతూ దేశంలో మహిళలపై రోజు రోజు కు హింస పెరుగుతోందన్నారు. మహిళల హింస పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని విమర్శించారు. హింసను ప్రతిఘటిస్తేనే మహిళలకు భద్రత కలుగుతుంద న్నారు. మహిళా రక్షణ చట్టాల అమలులకు మహిళలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అఖిల భారత మహిళా సంఘం ఆధ్వర్యంలో హింసపై మహిళల పోరు యాత్ర పేరుతో ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహిస్తుందన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు హిందూపురంలో ప్రారంభమయ్యే బస్సు యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో హిందూపురం, పాలసముద్రం , కదిరిలో బహిరంగ సభలు జరుగుతాయనిమహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా విజయవాడ నందు హింసను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున బహిరంగ సభ జరుగుతుందని ఇందులో ఐద్వా జాతీయ నాయకురాలు బృందాకరత్ పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ సభ్యులు నాగమణి, షాహినా, అలివేలమ్మ, అనిత, ఆసియా, హేమావతి తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు దిల్షాద్



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

ఆయా శాఖల పరిధిలో ప్రజా సంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ శాఖల పురోభివద్ధిపై సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు, వారిశాఖ ద్వారా జరుగుతున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను స్థాయీ సంఘ సభ్యులకు వివరించారు. స్థాయీ సంఘ సభ్యులు వారి సంబంధిత ప్రాదేశిక నియోజక వర్గం నందు గల సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని పరిష్కరించాలని జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ సంబంధిత అధికారులను అదేశించారు. విద్యాశాఖలో నిర్లక్ష్యం తీరుపై ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శెట్టూరు, కంబదూరు మండలాల్లో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై వెంటనే విచారణ జరిపించి అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి 104 సర్వీసులను అన్ని మండలాల్లోనూ అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం పక్కన సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేసేలా సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశాలలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.భాస్కర్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని స్థాయీ సంఘాల్లోని జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పిహెచ్‌డి పొందిన భారతికి సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కూలి పని చేసుకుంటూ పిహెచ్‌డి సాధించిన సాకే భారతిని ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా అభినందించారు. శింగనమల మండలం నగులగూడం గ్రామంలో నున్న సాకే భారతిని బుధవారం కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు. అనంతరం ధర్మవరం వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా విలేకరులతో మాట్లాడుతూ కూలి పని చేసుకుంటూ పిహెచ్‌డి చేయడం ఎంతో గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



సాకే భారతిని సన్మానిస్తున్న షేక్ మహబూబ్బాషా

కంకర అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కంకర అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవిన్యూ, పోలీస్, మైన్స్ అధికారులను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో మైన్స్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంకర అక్రమ రవాణా ఎక్కడ జరిగిన ఉపేక్షించరాదన్నారు. రెవిన్యూ, పోలీస్, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలోని మడకశిర, ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరం తదితర ప్రాంతాల పరిధిలో అక్రమ రవాణా ఎక్కువైందని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి రహదారులు పంచాయతీ రాజ్ పనులు ఎక్కువగా జరుగుతున్నాయని దీంతో కంకర అక్రమ తరలింపు జరుగుతోందని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కొండయ్య, కదిరి ఆర్డీవో రాఘవేంద్ర, మైన్స్ జిల్లా అధికారి రామ్మోహన్ రావు, డిఎస్‌పి వాసుదేవన్, మైనింగ్ జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలి

యంగ్ ఇండియా ప్రాజెక్ట్ సంస్థ అధినేత నరేంద్ర సింగ్ బేడీ

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రజలందరూ ఆలోచనలో మార్పు తెచ్చుకొని సుఖవంతమైన జీవితం గడపాలని యంగ్ ఇండియా ప్రాజెక్ట్ సంస్థ అధినేత నరేంద్ర సింగ్ బేడీ కోరారు. మండల పరిధిలోని గుట్టూరు గ్రామ సమీపంలోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్ సంస్థ కార్యాలయం ఆవరణలో బుధవారం నరేంద్ర సింగ్ బేడీ 84వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత నరేంద్ర సింగ్ బేడి మాట్లాడుతూ 1970లో అనంతపురం జిల్లాలో యంగ్ ఇండియా ప్రాజెక్ట్ సంస్థను ప్రారంభించామన్నారు. సంస్థ ప్రారంభంలో నిరుపేదల ఆకలి తీర్చడానికి దాతల సాయంతో నిత్యవసరాల సరకులు పంపిణీ చేశామన్నారు. అనంతరం వ్యవసాయ పంటలు సాగు చేయడానికి రైతులకు బోరు బావులు తవ్వించి పంటలను సాగుచేసేందుకు సాయం అందించామన్నా రు. సమాజంలో మహిళలు వెనుకబడిన వర్గాల ప్రజలు పెత్తందారి వ్యవస్థలో సమస్యలకు గురవుతున్నారని గుర్తించి ప్రజలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ కళలు అంతరించిపోతున్న తరుణంలో యువతకు పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళలందరినీ ఐకమత్యం చేయడానికి మహిళా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల చట్టాలు వాటి అమలు తీరుపై వివరించామ న్నారు. మహిళా దినోత్సవం, కార్మికులు దినోత్సవం కార్యక్రమాలపై పెద్ద ఎత్తున సభలు సమావేశాలు నిర్వహించి ప్రజల ఆలోచనల్లో మార్పులు తీసుకొచ్చామ న్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చేతివృత్తులు స్వయం ఉపాధి కార్యక్రమాలు నేర్పించామన్నారు. పాడి పోషణకు ఆవులు గేదెలు గొర్రెలు మేకలు పంపిణీ చేయించామన్నారు. అనంతరం అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు, కడప, నెల్లూరు, చిత్తూరు,నల్గొండ జిల్లాలోని అన్ని మండలాల్లో మండల కార్యాల యాలు ఏర్పాటు చేసి వందల మంది నాయకులను తీర్చిదిద్ది గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించామన్నారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను సమాజానికి చాటి చెప్పుతూ ప్రజల సమస్యలు ప్రభుత్వాలకు తెలియచేసేలా చేశామన్నారు.వికలాంగుల ఎదుగుదలకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించి వారికి ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు చట్టాలు తెలియ చేస్తూ అంగవైకల్యం గల వికలాంగులకు ఆపరేషన్లు చేయిస్తూ వారికి అవసరమయ్యే పరికరాలు పంపిణీ చేశామన్నారు. వాటితోపాటు అప్పటి ప్రభుత్వం ఉపాధి హామీచట్టం సక్రమంగా అమలు చేయకపోవడంతో పెద్ద ఎత్తున ఆందోళనలు ధర్నాలు, ర్యాలీలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ వ్యవసాయ కూలీల యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేయించామ న్నారు. 50 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాలు నిర్వహించడంతోనే మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా 6 జిల్లాల్లోని నాయకుల నడుమ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. నాయకులందరూ నరేంద్ర సింగ్ బేడిని శాలువాలు, జ్ఞాపికలను అందించి సన్మానించారు. అనంతరం సంస్థ ఆవరణంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీం లీడర్లు క్రిష్టప్ప, నరసింహులు, బలరాం, బదరీష్, కృష్ణమూర్తి, బయపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, బాల్విన్, లక్ష్మీనారాయణ, నాగభూషణ, రాజు, భానూజ, ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా బేడీ సతీమణి సోనియా బేడి, కుమార్తె తార, మనవరాలు, మనవళ్ళు కుటుంబీకులు, ఎపి జర్నలిస్టుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవి, రామాంజినేయులు, నారాయస్వామి, వెంకటాద్రి పాల్గొన్నారు.



నరేంద్ర సింగ్ బేడీని సన్మానిస్తున్న నాయకులు

నేతన్న నేస్తంతో చేనేతల జీవనం మెరుగు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నేతన్న నేస్తం చరిత్రాత్మక పథకమని, పథకం ద్వారా వచ్చే డబ్బుతో చేనేత కార్మికులు మగ్గాలను ఆధునీకరించుకుని మెరుగైన సంపాదన పొందుతున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 21న నేతన్న నేస్తం 5వ విడుత నిధులు జమ చేస్తున్న సందర్భంగా బుధవారం పట్టణంలో చేనేత కార్మికులు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నేతన్న విగ్ర హం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ చేనేతలను ఆదుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు జింకా కంబగిరి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్లతో పాటు 40వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, చేనేత నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న చేనేత కార్మికులు, ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్లాస్టిక్ తయారీని అరికట్టాలి

తనకల్లు : మండల పరిధిలోని చీకటిమానిపల్లిలో జరుగుతున్న ప్లాస్టిక్ వస్తువుల తయారీని నివారించాలని పలువురు నాయకులు, ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇక్బాల్ మాట్లాడుతూ గ్రామంలో జాతీయ రహదారి ఇరువైపులా ప్లాస్టిక్ పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు యథేచ్ఛగా తయారు చేస్తున్నారన్నారు. తయారీదారులు ఫ్యాక్టరీ నిబంధనలు పాటించకుండా ఏకంగా జాతీయ రహదారికి అతి సమీపంలో తయారు చేస్తున్నారు. అదేవిధంగా కత్రిమ ఎరువులని చెప్పి వాటిలో రసాయనిక ఎరువులు కలుపుతున్నారని విమర్శించారు. ఈ ప్లాస్టిక్ తయారీ వ్యక్తులు ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు.కబ్జా చేసినటువంటి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు చౌడప్ప యాదవ్, రైతు సంఘం మండల కార్యదర్శి కరీముల్లా, గిరిజన సంఘం నాయకులు రవి నాయక్, రైతు సంఘం నాయకులు రామయ్య యాదవ్, కన్నయ్య, రెడ్డప్ప, చౌడప్ప, వెంకటరమణ, ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అదేశించారు. పట్టణంలోని ముక్కడిపేట ప్రాంత ప్రజలు తమ ప్రాంతంలో మురుగు కాలువ పనులు నిలిపి వేశారని, దీంతో ఇబ్బంది పడుతున్నామని ఆ వార్డు కౌన్సిలర్‌తో కలిసి ఛైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఛైర్‌పర్సన్ ఇంద్రజ బుధవారం ముక్కడి పేట ప్రాంతంలో పర్యటించారు. అక్కడి నుండి ఇంజనీరింగ్ అధికారులకు ఫోన్ చేసి ముక్కడి పేట ప్రాంతంలో ప్రారంభించిన మురుగు కాలువ నిర్మాణ పనులను వెంటనే పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాసీర బాను షఫీ, తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ'లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కందకూర్లపల్లి, చిన్నకొడిపల్లి గ్రామల్లో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర నారాయణకు పలువురు సమస్యలను విన్నవించారు. రొద్దం నుంచి కందుకూ ర్లపల్లి మీదుగా చిన్నకోడపల్లి, చోలే మరి వరకు రోడ్డు చేపట్టాలని కోరారు. స్పందిం చిన ఆయన త్వరలోనే రోడ్డు పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం పలు అభివృద్ధి పనులను భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రూప, ఎంపిపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎన్. నారాయణరెడ్డి, రవి శేఖర్ రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే ఇళ్ల స్థలాలు సాధన

ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షులు దిల్షాద్



సమావేశంలో మాట్లాడుతున్న దిల్షాద్

ప్రజాశక్తి-పెనుకొండ

పోరాటాల ద్వారానే ఇళ్లస్థలాలు సాధించుకుంటామని ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్ అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి అధ్యక్షతన పట్టణంలో ఎస్సీ బాలుర హాస్టల్ ఆవరణంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేద మహిళలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షులు దిల్షాద్ మాట్లాడుతూ కియా, ఇతర పరిశ్రమలు పెనుకొండ పట్టణం చుట్టూ రావడంతో పేదల సొంతింటి కల గగనమైందన్నారు. భూమి విలువ అమాంతం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే బాడుగ ఇంటిలో ఉంటూ రోజువారి కూలి పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకోవడమే భారమై బాడుగలు కట్టుకోలేని దీనస్థితిలో ప్రజలు ఉన్నారన్నారు. మరోవైపు విలువైన ప్రభుత్వ స్థలాలు కొంతమంది రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఆక్రమణలు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వందల మంది ఇళ్లు లేని నిరుపేదలు వ్యక్తిగత అర్జీలను మున్సిపల్ కమిషనర్ నుంచి కలెక్టర్ వరకు సమర్పించినా కనీస చర్యలు తీసుకొని స్థలాలు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. దీనిబట్టి చూస్తే పేదల పట్ల అధికారుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుందని విమర్శించారు. సమస్యల పరిష్కారం పట్ల మహిళలు చైతన్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద మహిళలు అనేక నిరసనలు, విజ్ఞప్తులు చేసినా అధికారుల్లో చలనం లేదన్నారు. మనం స్థలాలు సాధించుకోవాలంటే గుడిసెలు వేయడమే మార్గమని అన్నారు. అనంతరం తహశీల్దార్‌ని కలిసి సమస్యను వివరించారు. ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుని 90 రోజులు పూర్తయిందని తక్షణం ఇళ్ల స్థలాలు చూపించాలని కోరారు. తహశీల్దార్ స్పందిస్తూ పై అధికారుల నుండి ఇంకా ఆదేశాలు రాలేదని వచ్చిన వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అంతవరకు ప్రభుత్వ స్థలాల్లో తాము గుడిసెలు వేసుకుంటామని ఆతర్వాత జరిగే పరిణామాలకు అధికారులు బాధ్యత వహించాలని నాయకులు హెచ్చరించారు. అనంతరం ఇండ్ల స్థలాల సాధన కోసం ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులుగా జిగిని, ముబీన లతో పాటు పట్టణ కమిటీ సభ్యులుగా 12 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, సిపిఎం స్థానిక నాయకులు తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వవైభవం

మడకశిర : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం వస్తుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి తెలిపారు. బుధవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఎస్, ఓటరు వెరిఫికేషన్, బిటిఓస్, టెలిగ్రామ్ తదితర వాటి గురించి నియోజకవర్గ కోఆర్డినేటర్లు రామకృష్ణ, శివకుమార్, కాంతరాజు, పార్లమెంట్ కో ఆర్డినేటర్ రమణ వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య చౌదరి, కోట్ల రంగేగౌడ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు నాగరాజు, కన్నా, సి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వాహనాలతో పాఠ్యపుస్తకాల తరలింపు

రొద్దం : రేషన్‌సరుకులు లబ్ధిదారులకు అందించే ఎండియు వాహనంలో పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు తరలించిన ఘటన రొద్దం మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలో 64 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలకు విద్యాసంవత్సరం ప్రారంభంలో 80శాతం పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తీసుకుపోయారు. మిగిలిన 20శాతం పాఠ్యపుస్తకాలు ఎంఆర్‌సి కార్యాలయానికి చేరాయి. వీటిని 64 పాఠశాలలకు తరలించాల్సి ఉంది. అయితే ఎంఆర్‌సి నుంచి ఆయా పాఠశాలలకు పుస్తకాలను రేషన్‌సరుకులు తీసుకెళ్లే వాహనంలో తరలించారు.

వేరుశనగ దిగుబడిపై రైతులకు అవగాహన

పుట్టపర్తి రూరల్ : రానున్న ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట అధిక దిగుబడి ఏ విధంగా సాధించుకోవాలన్న దానిపై వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పుట్టపర్తి మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మల్లేశ్వరి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంపత్ కుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట దిగుబడి ఏ విధంగా పెంచాలి, ఆదాయం ఏ విధంగా రెట్టింపు చేయాలన్న దానిపై పలు సూచనలు చేశారు. కదిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వేమన వివిధ పంటలలో తెగుళ్ళు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రాయుడు వరి, వేరుశనగ, కంది, మామిడి పంటల సాగులో తలెత్తే సమస్యల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్ రెడ్డి, చందన, జిల్లా నీటి యాజమాన్య సంస్థ భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌టిఎస్‌పై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆర్‌టిఎస్ శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు టిడిపి గ్రామీణ మండల కన్వీనర్ విజయ్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. పార్టీ బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

పుట్టపర్తి రూరల్: గ్రామ సచివాలయాల్లో క్షేత్రస్థాయిలో పనులు పరిశీలన చేసేందుకే మండలాల్లో పర్యటిస్తున్నట్లు డిప్యూటీ సీఈవో లలితా బాయి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. సకాలంలో విధులకు హాజరుకావాలని ఎప్పటికప్పుడు సంబంధిత బిల్లులు, ప్రజా సమస్యలను త్వరితగతిన తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

ఓబుల దేవర చెరువు : పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తోందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ద్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలో నల్లగుట్ల పల్లి గ్రామంలో రైతు రఘునాథరెడ్డి పొలంలో మామిడి చెట్లను నాటారు. సందర్భంగా ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న అర్హత కలిగిన ప్రతి రైతుకూ ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో మామిడి, జామ, అల్లనేరేడు తదితర 17 రకాల పండ్లమొక్కలు అందజేస్తుందని చెప్పారు. అనంతరం అమృత్‌సరోవర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసరెడ్డి, సిఎల్‌ఆర్‌సి కోర్సు డైరెక్టర్ శారద, ఏపీవో సోమశేఖర్ రెడ్డి, సిసి అంజనేయులు, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి, రాజేంద్ర, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ధర్మవరం టౌన్ : తమ సమస్యలను పరిష్కరించిన కృతజ్ఞతలు తెలుపుతూ ఆర్టీసీ ఉద్యోగులు సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వములో విలీనం చేసి వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచి పీఎఫ్ హైయర్ పెన్షన్ ద్వారా అధిక పెన్షన్ రావడానికి ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలకు తాము హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లికార్జున, ట్రాఫిక్ ఇన్‌ఛార్జ్ వెంకటేశులు, హెడ్ క్లర్క్ ప్రేమ్ కుమార్, అకౌంటెంట్ ఓబులేసు, ఎంసి. వెంకటేశ్వర్లు, యూనియన్ ప్రతినిధులు నారాయణ రెడ్డి, మధుసూదన్, నాగేంద్ర, ఈశ్వర ప్రసాద్, సీనయ్య, ముత్యాలప్ప, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిని నిగ్గుతేల్చండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సర్పంచి ఆవేదన

ప్రజాశక్తి బుక్కపట్నం

మండల పరిధిలోని పాముదుర్తి గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ ఉపాధి పనుల్లో భారీగా అవినీతికి పాల్పడ్డాడని విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచి జ్యోగి డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై తాను, వైసిపి సీనియర్ నాయకులు ఇంద్రజిత్ రెడ్డి కలిసి ఇదివరకే జిల్లా కలెక్టర్, ఉపాధి హామీ పీడీ, ఎంపీడీవో, ఏపీవోలకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లభించడం లేదని విమర్శించారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పనులకు వెళ్లకుండానే ఫోర్జరీ సంతకాలతో జాబ్ కార్డులను సృష్టించి నెల నెల వారి అకౌంట్ లోకి డబ్బులు జమ చేస్తూ అవినీతికి పాల్పడుతూ నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో కొంతమందికి జాబ్ కార్డు సష్టించి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల్లో చలనం లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణ జరిపించి అర్హులైన ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని కోరారు. ఫీల్ట్ అసిస్టెంట్ అక్రమాలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఎంపీడీవో శ్రీనివాసులు స్పందిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ పై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడినట్లైతే సంబంధిత శాఖ అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు..

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి గోరంట్ల

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కలెక్టర్ బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు విద్యార్థులకు నాణ్యమైనభోజనం అందించాలని ఉపాధ్యాయులను ఏజెన్సీ వారిని ఆదేశించారు. విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లు పాఠశాలలో ఎంతమందికి పంపిణీ చేశారన్న వివరాలను హెచ్‌ఎం గోపాల్‌ను అడగగా ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెవివికిట్లు ఎంతమందికి పంపిణీ చేశారు అనే విషయం కూడా తెలియకపోతే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి చేత బయోమెట్రిక్ చేయించాలన్నారు. శ్రీ చైతన్య ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని కొంతమంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆ పాఠశాలను పరిశీలించాలని ఎంఇఒను కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, ఎంఇఒ గోపాల్, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ ముందు మున్సిపల్ స్థలాన్ని అక్రమణ చేసుకుని ఎవరు వ్యాపారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ వ్యాపారులకు హెచ్చరించారు. ఈ మేరకు కమిషనర్ మున్సిపల్ అధికారులతో పాటు సచివాలయ సెక్రేటరీలతో కలిసి మార్కెట్ ముందు ఆక్రమణ చేసుకుని వ్యాపారాలు చేస్తున్న వారితో చర్చించారు. గదులను వేలం పాట ద్వారా తీసుకుని, గదిలో వ్యాపారాలు చేసుకోకుండా బయట చేస్తున్న వ్యాపారులను అక్కడి నుంచి ఖాళీ చేయించి వారి గదులలోకి పంపించారు. అనుమతులు లేకుండా చేసుకుంటున్న వ్యాపారులను అక్కడి నుంచి ఖాళీ చేయించారు. మూడు రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న అన్ని దుకాణాలతో పాటు తోపుడు బండ్ల వారికి ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

రాష్ట్ర వాల్మీకి,బోయ కార్పొరేషన్ చైర్మన్‌గా పొగాకు రామచంద్ర ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి -పెనుకొండ

విజయవాడ బిసి భవన్ లో బుధవారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి/ బోయ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పెనుకొండకు చెందిన వైసిపి నాయకులు పొగాకు రామచంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఎమ్‌డి చంద్రశేఖర్ రాజు పొగాకు రామచంద్ర చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, వాల్మీకి సంఘం నేతలు పొగాకు రామచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వాల్మీకి/ బోయ కార్పొరేషన్ చైర్మన్ గా పొగాకు రామచంద్ర రెండేళ్ల పాటు కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో 56 బిసి కులాల కార్పొరేషన్ కోఆర్డినేటర్ ప్రవీణ్, వైసిపి నాయకులు కర్రా సంజీవరెడ్డి, గుడిపల్లి కళ్యాణ్, చంద్రగిరి వీర నారాయణరెడ్డి, పాదయాత్ర నటేష్, వెంకటగిరి పాల్యం హనుమంత రెడ్డి, చిన్నపరెడ్డిపల్లి శ్రీనివాస్ రెడ్డి, గుట్టూరు సురేష్, అమ్మవారి పల్లి ప్రసాద్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు కృష్ణ, గుంటూరు జిల్లాల వాల్మీకి నాయకులు, పెనుకొండ నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పొగాకు రామచంద్ర

పత్తి రైతుకు ఎకరాకు రూ. 25వేలు పరిహారం ఇవ్వాలి

టిడిపి జిల్లా ఇన్‌-ఛార్జి బికె పార్థసారథి

ప్రజాశక్తి రొద్దం

జిల్లాలో పంట నష్టపోయిన పత్తి రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి బికె. పార్థసారథి డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.కొత్తపల్లిలో తెగుళ్ల సోకిన పత్తి పంటలను బుధవారం పరిశీలించారు. అనంతరం పార్థసారథి విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు గ్రామాల్లో తిరిగి రైతు సాగుచేసిన పంటలను పరిశీలించి ఈ క్రాప్ బుకింగ్ చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు 25వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు గ్రామస్థాయిలో పత్తి పంటను పరిశీలించిన పాపాన పోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, అశ్వర్థ నారాయణ, హరీష్, సర్పంచి నాగరాజు, మంజు, చంద్రశేఖర్ నాయుడు, చంద్ర, అక్బర్, నారాయణప్ప, ఈరప్ప తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ ఇంద్రధనస్సు'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి ఎస్వీ. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పుట్టపర్తి లోని శ్రీ శక్తి భవనంలో బుధవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు ,సూపర్వైజర్లకు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలు, గర్భిణుల పేర్లు అన్‌లైన్ నమోదు చేసేందుకు యు విన్ పోర్టల్ శిక్షణను మధుకర్, సహాయకులు విజయ్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి, జిల్లా అధికారి డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విజయవంతంగా పూర్తి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి :కనగానపల్లి

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని పాతపాళ్యం గ్రామానికి చెందిన మహిళా రైతు శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బత్తల కదిరిప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణికి ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారన్నారు. భర్తకు మతి స్థిమితం లేకపోవటంతో కుటుంబాన్ని పోషించడానికి శ్రావణి తనకున్న 9ఎకరాల పొలంలో వ్యవసాయం చేయాల్సి వచ్చిందన్నారు. పంటలసాగుకు, పిల్లల చదువులకు, ఇంటి పోషణకు దాదాపు రూ. 10లక్షలు అప్పుచేసిందన్నారు. పంటలు పండక అప్పు తీర్చలేక అప్పులు ఇచ్చినవాళ్ళతో ఒత్తిడి ఎక్కువ కావటంతో శ్రావణి ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 15లక్షలు అందజేయాలని రుణం మాఫీ చేసి అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

ఇష్టారాజ్యంగా వెల్ఫేర్ అసిస్టెంట్ వ్యవహారం

ఇబ్బందుల్లో ప్రజలు , పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి మడకశిర

మండల పరిధిలోని చెందకచెర్ల పంచాయతీ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సచివాలయ పరిధిలోని జమ్మనపల్లివాసులు వాపోతున్నారు. రెండు నెలల క్రితం వాలంటీర్‌ను తొలగించడంతో ఆ బాధ్యతలను వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అప్పగించారన్నారు. అయితే ఆయన విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సచివాలయానికి కూడా సరైన సమాయానికి రాకపోవటంతో వివిధ పనుల కోసం వచ్చిన గ్రామస్తులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ఆగ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మహాశక్తి ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి -పెనుకొండ

టిడిపి మేనిఫెస్టోలోని అంశాల పట్ల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహనకల్పించేందుకు ఏర్పాటు చేసిన మహాశక్తి ప్రచార రథాన్ని మండలంలోని మునిమడుగు గ్రామంలో గురువారం సాయంత్రం 3గంటలకు ప్రారంభించనున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాల గురించి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీ చైతన్య పాఠశాలకు అనుమతులు మంజూరు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు అనుమతులు మంజూరు అయ్యాయని ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి తెలిపారు. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వం నుండి అనుమతులు మంజూరు అయ్యాయని చెప్పారు. గతంలో అనుమతులు లేనందున ఈ పాఠశాలను సీజ్ చేసినట్లు చెప్పారు. పాఠశాల తరగతులను యధావిధిగా కొనసాగుతాయని ఆమె తెలిపారు

నేరాలు ఘోరాలు

సైబర్ మోసగాళ్ల సరికొత్త మోసం

ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలే టార్గెట్
పరిహారం ఇస్తామని ఆశ చూపి బ్యాంకు అకౌంట్‌లో డబ్బు స్వాహా

చిలమత్తూరు : సైబర్ మోసగాళ్లు చేతుల్లో రోజు ఎంతో మంది అమాయకులు బలై పోతున్నారు. రుణాలు ఇప్పిస్తాం, ఉద్యోగాలిప్పిస్తాం అంటూ ఫోన్‌పే, గూగూల్ పే వంటి వంటి యాప్‌ల ద్వారా డబ్బులు వేయించుకోవడం మొదలు ఎఇపిఎస్ ద్వారా నకిలీ వేలి ముద్రలు తయారు చేసి అకౌంట్ లో ఉన్న డబ్బులు స్వాహా చేయడం లాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో సైబర్‌నేరగాళ్లు సరికొత్త మోసాన్ని ఎంచుకున్నారు. కరోనా సమయంలో కరోనాతో చనిపోయిన కుటుంబాలను టార్గెట్ చేసి పరిహారం వచ్చింది. ఇంత డబ్బులు మీరు చెల్లించాలని ఫోన్ చేసి పేమెంట్ థర్డ్ యాప్స్ ద్వార డబ్బులు వేయించుకొని మోసం చేసిన సైబర్ మోసగాళ్లు తాజాగా యాక్సిడెంట్ అయిన కుటుంబాలను టార్గెట్ చేసి వారి డబ్బులను దోచేస్తున్నారు. ఇలాంటి సంఘటన చిలమత్తూరు మండలంలో బుధవారం చోటు చేసుకుంది.



నగదు పంపినట్లు స్టేట్‌మెంట్ చూపుతున్న బాధితుడు

చిలమత్తూరు తహశీల్దార్ నాగరాజుకు బుధవారం ఓ ఫోన్ కాల్ వచ్చింది. మీ ప్రాంతంలో ఈ మధ్య జరిగిన యాక్సిడెంట్ వివరాలు చెప్పండని ఫోన్‌చేసిన వ్యక్తి తహశీల్దార్‌ను కోరాడు. దీంతో తహశీల్దార్ ఈ మధ్యకాలంలో యాక్సిడెంట్ అయిన వారి వివరాలు ఇవ్వాలని చిలమత్తూరు వీఆర్వోకు చెప్పారు. వీఆర్వో వద్ద వివరాలు సేకరించిన ఆ వ్యక్తులు గత నెల 24న టేకులోడు క్రాస్ లో జరిగిన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంబందించి పాతచామలపల్లిలోని వ్యక్తులకు ఫోన్ చేశారు. ఆర్ అండ్ బి నుంచి పరిహారం రూ. 6. 25 లక్షలు వస్తుందని ఈ నెంబర్ కి ఆధార్ కార్డ్ ,బ్యాంక్ డిటైల్స్ పంపమని కోరారు. దీంతో బాధితులు వారు చెప్పినట్లు 9606315097 ఫోన్‌నెంబరుకు వివరాలు పంపారు. వెంటనే అవతలి వ్యక్తులు తిరిగి ఫోన్ చేసి పంపిన వివరాలు లో కొన్ని తప్పులు ఉన్నాయని వాటిని సరిచేయడానికి డబ్బులు ఖర్చు అవుతాయని చెప్పారు. ఆ డబ్బులు చెల్లిస్తే మొత్తం డబ్బులు ఖాతాలో జమ చేస్తామని నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన మృతుని బంధువు మాజీ ఎంపిటీసి జి శివప్ప 16,470 రూపాయలు ఫోన్ పే ద్వార పంపాడు. అలాగే మరో మృతుడు కుటుంబసభ్యుడు బాలచంద్రారెడ్డి రూ. 16,500 రూపాయలు ఫోన్ పే ద్వారా పంపారు. అయితే ఎంతసేపటికి డబ్బులు తమ ఖాతాల్లో జమ కాకపోవడంతో తిరిగి ఫోన్ చేస్తే ఆ ఫోన్ నెంబర్లు స్విచ్ ఆఫ్ వచ్చాయి. దీంతో తాము మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు తహశీల్దార్ వద్ద మొరపెట్టుకున్నారు. ఆయన సూచనల మేరకు బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచనల మేరకు సైబర్‌సైట్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరగాళ్లు అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి బాధితులను మోసగించి డబ్బులను స్వాహా చేసిన ఘటన గ్రామంలో చర్చనీయంశంగా మారింది. బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భర్తను చంపిన కేసులో భార్య అరెస్టు

కదిరి అర్బన్ : కదిరి నియోజకవర్గ పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన పవన్ కుమార్ హత్యకేసులో మృతుని భార్యను కర్నాటక పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మృతుని అక్క రత్నమ్మ తెలిపిన వివరాలు.. బొమ్మిరెడ్డి పల్లికి చెందిన పవన్‌కుమార్ తన భార్య పార్వతితో కలసి బెంగుళూరులో నివాసముండేవాడు. పవన్ ఒక పాఠశాలలో వాహన డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. పార్వతి గార్మెంట్ పరిశ్రమలో పనిచేయడానికి వెళుతుండేది. ఈ నేపథ్యంలో పార్వతికి అక్కడే ఫాక్టరీలో పనిచేస్తున్న ఎల్లప్ప అనే వ్యక్తితో పరిచమైంది. ఇతను బిల్లాపురంలో నివాసముండేవాడు. ఈసందర్భంగా ఎల్లప్పతో పరిచయం పెంచుకున్న పార్వతి అతనితో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. ఈ నేపథ్యంలో పార్వతి తన భర్త పవన్‌తో తరచూ గొడవపడేది. పార్వతి ఎల్లప్పను కలవడానికి ఇబ్బందిగా ఉందన్న ఉద్దేశ్యంతో కాపురాన్ని మదనపల్లికి మార్చింది. అయినా పవన్ బెంగుళూరులో పనికి వెలుతుండేవారు. పవన్ బెంగుళూరుకు వెళ్లినపుడు ఎల్లప్ప మదనపల్లికి వచ్చి పార్వతిలో ఉండివెళ్లేవాడు. ఈ నేపథ్యంతో తన భర్త ఉంటే తన వివాహేతర సంబందానికి అడ్డు పడతాడని పార్వతి ఆలోచిందింది. పథకం ప్రకారం ప్రియుడు ఎల్లప్పతో కలసి పవన్‌ను హతమార్చాలనుకుంది. మే 1వ తేదీ రాత్రి బెంగుళూరుకు వెళ్లి భర్త పవన్‌ను కలిసింది. మాటలు చెప్పి సమీపంలోని వసుకోటా అని ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం తాపించింది. ప్రియుడితో కలిసి పవన్‌ను హతమార్చి రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు చిత్రీకరించారు. ఎల్లప్ప తాను తీసుకువచ్చిన బోలోరో వాహనంతో పవన్‌ను శ్రీనివాసపురం పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై వేశారు. ఆ తరువాత అదే వాహనంలో పవన్‌ను ఢీకొట్టినట్లు చిత్రీకరించి వెళ్లిపోయారు. గుర్తుతెలియని మృతదేహంగా భావించిన కర్నాటక పోలీసులు శ్రీనివాసపురం హాస్పిటల్‌కు తరలించారు. మూడు రోజుల పాటు మృతుని బంధువులు ఎవ్వరు రాకపోడంతో అనాధ మృతదేహంగా భావించి దహన సంస్కారాలు చేశారు. పవన్ కన్పించలేదని అతని తండ్రి, అక్కలు రత్నమ్మ, భారతమ్మ, సునందమ్మ మే 5వ తేదీ బెంగుళూరులోని సజ్జాపూర్ పోలీసుస్టేషన్ లో పిర్యాదుచేయడానికి వెళ్లారు. అయితే అంతకు మునుపే పవన్ భార్య పార్వతి ఎవ్వరికి అనుమానం రాకుండా తన భర్త కన్పించలేదని మిస్సింగ్ కేస్ పెట్టింది. పవన్ హత్య జరిగిన 79 రోజుల తర్వాత కర్నాటక పోలీసులు ఈ కేసు మిస్టరీని చేధించారు. పోలీసుల విచారణలో పార్వతి తన భర్తను హత్య చేసినట్లు అంగీకరించినట్లు మృతుని అక్క రత్నమ్మ తెలిపారు. తన తమ్ముడు పవన్ కుమార్‌ని చంపిన పార్వతి, ఎల్లప్పను కఠినంగా శిక్షించాలని బాధితులు కోరారు. నిందితురాలు పార్వతిది కదిరి నియోజకవర్గం నంబుల పూలకుంట మండల పరిధిలోని పెడబల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందినదని రత్నమ్మ చెప్పారు.

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన

ఓబుల దేవర చెరువు : మండలంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందించాలన్న డిమాండ్‌తో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం వినూత్న నిరసన తెలిపారు. సిపిఎం రమణ, సిఐటియు శ్రీరాములు, కుళ్లాయప్ప ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట బిక్షాటన చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవటం దారుణమన్నారు. వెంటనే అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాలెమ్మ, రమణమ్మ, నిర్మల, భాగ్యమ్మ, రామలక్ష్మి, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కదిరి అర్బన్ : మండల పరిధిలోని కట్లతండాలో రూ. 10 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటర్, పైప్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కట్లతండా వాసుల దాహార్తిని తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి విధానాలను ప్రజలకు వివరించండి

కదిరి టౌన్ : ప్రభుత్వ విధానాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించి టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ క్లస్టర్ ఇన్‌ఛార్జులకు సూచించారు. బుధవారం కదిరి పట్టణంలోని వి ఆర్ సి ఫంక్షన్ హాల్‌లోకందికుంట అధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్, బూత్ కన్వీనర్లకు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. వచ్చే ఎన్నికలలో కదిరి నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యశోద కాన్సెప్ట్ స్కూల్లో ఎన్నికలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్లో బుధవారం కేబినెట్ ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించామని పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. పాఠశాల లోని విద్యార్థులను గ్రూపులుగా విభజించి నూతన ఎస్‌పిఎల్, ఎఎస్‌పిల్‌ను ఎన్నుకున్నామన్నారు. అనంతరం వారి చేత ముఖ్యఅతిథిగా హారైన సిఐ సిఐ రాజా ప్రమాణస్వీకారం చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనూప్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ రాయలసీమపై ప్రచారం

బుక్కపట్నం : నారా లోకేష్ యువగళం పాదయాత్రలో రాయలసీమ యువత కొరకు ప్రకటించిన మిషన్ రాయలసీమపై మండల కేంద్రంలో తెలుగు యువత ఆధ్వర్యంలో కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అది టిడిపితోనే సాధ్యమవుతుందని అన్నారు. నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో రాయలసీమ ప్రాంతంలో వలసలు, నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, తెలుగు యువత నాయకులు శ్రీనివాస్ రెడ్డి సుధాకర్, వైవి. మురళి, సుధీర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ

హిందూపురం : భారత ప్రభుత్వం తీసుకోస్తున్న కామన్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరాస్మృతి) చట్టం పై ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని శాంతి ఆనంద పాఠశాలలో 1వ తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న 200 మంది విద్యార్థులకు బుధవారం శాంతి ఆనంద సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ లోక్‌నాథ్ పాల్గొని విద్యార్థులకుపుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ చంద్రమోహన్, ప్రిన్సిపల్ రాజశేఖర్ , సెక్రటరీ కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టిడిపి సీనియర్ నాయకుడు మృతి

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలం బ్యాడిగెర గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు పాపన్న బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిఎస్ గురుమూర్తి, దాసిరెడ్డి, కృష్ణప్ప, ఈరన్న, బ్యాడిగెర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేయండి

పెనుకొండ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర టిఎన్‌టియుసి అధికార ప్రతినిధిగా ఎన్నికైన బ్యాళ్ల నాగేంద్ర అనంతపురంలో శ్రీసత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బికె. పార్థసారథిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి. కె. పార్థసారథికి అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవులకిష్ట, చంద్రాయుడు, పరంధామ, నాగముని, నరసింహులు, నాగభూషణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి మహాశక్తి చైతన్యయాత్ర

కనగానపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈనెల 21 నుంచి మహాశక్తి చైతన్య యాత్రను చేపట్టనున్నట్లు ఆపార్టీ మండల నాయకులు తెలిపారు. మండలంలోని ముత్తవకుంట్ల గ్రామం నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్రను మాజీ మంత్రి పరిటాల సునీత ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు రామసుబ్బమ్మ, మండల కమిటీ అధ్యక్షురాలు అరుణమ్మ, శ్రావణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజాసమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి చాంద్‌బాషా, జిల్లా నోడల్ అధికారి శివారెడ్డి, ఎంపీడీవో సౌజన్యకుమారి, విస్తరణాధికారి మమతా దేవి తెలిపారు. మండల పరిధిలోని తుమ్మల గొట్లూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్మల సర్పంచ్ ఈశ్వరమ్మ, పుల్లమ్మ ఉప సర్పంచి దివాకర్ రెడ్డి, ఎంపిటీసీ చెన్న కృష్ణమ్మ, గొట్లురు సర్పంచ్ రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న 11 రకాల సర్వీసుల గురించి అధికారులు తెలిపారు. వివరించారు. ఈ సందర్భంగా తుమ్మలలో మండల ప్రత్యేక అధికారి చాంద్ బాషా, డి ఎల్ డి వో శివారెడ్డి, విస్తరణాధికారి మమతా దేవి, ఎంపీడీవో సౌజన్యకుమారి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్లూరు మారుతి, పిట్టా నరసింహులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి, మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పని చేయండి : పల్లె


సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు : 2024 ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవిద్య కళాశాలలో పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో లోని పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. అలాగే ఓటర్ జాబితా సవరణ అయినందున ఆ జాబితాన్ని పరిశీలించి ఓట్లు ఉన్నాయా లేవా అని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ సర్పంచి వెంకటరమణప్ప, టిడిపి నాయకులు సుధాకర్, సురేష్, బోయ రాజు, చికెన్ సెంటర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి కొత్తచెరువు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఢిల్లీకి చెందిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ఎస్ సురేష్ కుమార్, అనిల్ కుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కుల్లాయప్ప నాయక్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం మండల పరిధిలోని కొడపగానేపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఇందులో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు గురించి ఎఎన్ఎంలు రమాదేవి, సంధ్య, ఎంపిహెచ్‌ఒను అడిగి తెలుసుకున్నారు. ఒపి సేవలు పెంచాలన్నారు గర్భిణులకు ప్రత్యేక చికిత్సలు అందించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పౌష్టిక ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్, ఎంపిహెచ్ఒ గౌరీదేవి, సిహెచ్ఒ కంబగిరి స్వామి, సూపర్‌వైజర్ నరసింహులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా వార్డులు, సచివాలయాల వరదిలో ప్రారంభం అవుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వాలంటీర్లు కలిసి విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో వివిధ సచివాలయాలను పరిశీలించిన ఆయన అధికారులతో చర్చించారు. అనంతరం ఇదే విషయంపై మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఇలు, ఎఇలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా ప్రతి ఓటును క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని బిఎల్ఒలకు తహశీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, సురేష్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ, రూరల్ మండల వ్యాప్తంగా బిఎల్ఒలతో ఇంటింటి సర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వే 21వ తేది నుంచి నెల రోజుల పాటు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పని చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవిన్యూ, మున్సిపల్ అధికారులు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

పోస్ట్ కార్డు ఉద్యమానికి విశేష స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపూర్ అసెంబ్లీ నుండి జగన్ మోహన్ రెడ్డి పోటీ చేయాలని కోరుతూ వైసిపి నాయకుడు, శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాల్మీకి నరేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్ట్ కార్డు ఉద్యమానికి విశేష స్పందన లభిస్తుంది, బుధవారం హిందూపురం పట్టణ పరిధిలోని హస్నాబాదు, ఆర్‌టిసి కాలనీలో చేపట్టిన పోస్ట్ కార్డ్ ఉద్యమానికి మహిళల నుండి విశేష స్పందన లభించింది, జగన్మోహన్ రెడ్డి హిందూపురం నుండి పోటీ చేస్తే అత్యధిక మెజార్టీ తో గెలుస్తారని ప్రజల అభిప్రాయపడుతున్నారని అంతేకాకుండా అభివద్ధి కూడా మరింత జరగడానికి అవకాశం ఉందని నాయకులు అన్నారు. అవసరమైతే ఆగష్టు నెలలో హిందూపురం నుంచి ఇడుపుల పాయ వరకు పాదయాత్ర చేపడుతామని వాల్మీకి నరేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

దొంగ ఓట్లను గుర్తించాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని అన్ని వార్డులలో ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించే దిశగా అధికారుల దష్టికి తీసుకొని రావాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం చిలకం వారి స్వగహంలో పార్టీ నాయకులకు కార్యకర్తలకు బూత్ లపై సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధ్యతగా అర్హులైన వారిని ఓటర్ జాబితాలోకి చేర్పించాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, సిద్ధంగా ఉండాలని వారు తెలిపారు. 104 బూతులకు ఓటర్ పరిశీల సభ్యులుగా పార్టీ నాయకులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఒకరికి రెండు ఓట్లు, మతి చెందిన వారి ఓట్లు ఇంకను తొలగించలేకపోవడం, డబుల్ ఎంట్రీ లాంటివి తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల వ్యాప్తంగా జగనన్న కాలనీలో 2379 గృహాలు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేశారు. ఇప్పటివరకు 695 ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ దశలలో నిర్మాణాలు జరుగుతున్నాయి వీటికి బిల్లులు పెట్టాలంటే లబ్ధిదారులకు ఇబ్బందులు తపపడం లేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హౌసింగ్ అధికారులు కుమ్మక్కై మామూలు ఇచ్చిన వారికే బిల్లులు పెడుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. బిబిఎల్ 589, బిఎల్ 767, ఆర్ఎల్ 161, ఆర్‌సి లెవెల్లో 35 నిర్మాణాలు కొనసాగుతున్నాయి లబ్ధిదారులకు బిల్లులు చెల్లించమని అధికారులను అడిగితే వారు డబ్బులు అడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. రూ. 2వేల నుండి రూ.3వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న లబ్ధిదారులకు 23 వేల రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ బిల్లులు పెట్టడానికి కూడా ఉపాధి హామీ సిబ్బంది లబ్ధిదారుల నుండి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు

ముడుపులు ముట్టజెప్పందే అందని బిల్లులు

ఉన్నాయి. లబ్ధిదారులకు వచ్చిన డబ్బులు అధికారులకు ఇవ్వడానికే సరిపోతున్నాయని బాధితులు వాపోతున్నారు. లింగారెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, మీర్జాపురం పంచాయతీల పరిధిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హౌసింగ్ అధికారులు కుమ్మక్కై కట్టని వాటి కూడా బిల్లులు చెల్లించినట్టు ఆయా గ్రామాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి కావలసిన వారికి ఒక ఇంటికి రెండు బిల్లులు కూడా ఇచ్చినట్టు ప్రచారం సాగుతోంది. కలెక్టర్ అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయమంటే అనర్హులకు మంజూరు చేసి వారికి బిల్లులు చెల్లించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ప్రభుత్వమేమో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని చెబుతోంది. అయితే మూడు సంవత్సరాలు అవుతున్న వీటి నిర్మాణాలు నత్తనడకనే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణ పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

యువశక్తి చైతన్య రథం ప్రారంభం

ప్రజాశక్తి మడకశిర

యువశక్తి చైతన్య రథాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని మెట్టబండ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చైతన్య రథాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా చేపడుతున్న వివిధ పథకాలను ప్రజలకు తెలియజేయడానికి ఈ చైతన్య రథాన్ని ఉపయోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. పసుపు రంగులో ఉన్న చైతన్య రథంలో మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అందరికీ అర్థమయ్యే విధంగా ముద్రించినట్లు వివరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

కదిరి అర్బన్ : మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి–1 గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.